# అన్నపూర్ణ ఉత్తరం

"ఒరేయ్ రాజూ రెండు మూడు రోజుల్నించి నీతో ఒక విషయం మాట్లాడాలని ఎలా మొదలెట్టాలో తెలియక మధన పడుతున్నాను"

"చెప్పరా శంకర్ నా దగ్గర నీకు మొహమాటం ఏంటి" అన్నాడు రాజు.

"అదేరా! ఎలా చెప్పాలో.. అదే నీకెలా చెప్పాల్రా?" అని నసిగాడు శంకర్. "మీ అమ్మాయి ఉత్తరం రాసిందిరా!"

"ఎవరికిరా శంకర్?"

"నాకే, దానికి జవాబు ఏమివ్వాలో తెలియక, తేలక సతమత మవుతున్నానురా! ఈ విషయం నీకు చెప్పకుండానే సాల్వ్ చెయ్యగలనను కున్నాను" అంటూ ఉత్తరమిచ్చాడు శంకర్.

రాజు ఉత్తరం చదవడం మొదలుపెట్టాడు.

చేతులొణుకుతున్నాయ్.

కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయ్.

"డియర్ అంకుల్,

నా ఇవ్వాళ నుంచి అంకులని పిలవాలని లేదు. 'ఏవండీ' అని సంబోధించాలని ఉంది. ఇలా అంటున్నానని మీరెలా అనుకుంటారో తెలీదు. ఆంటీ చనిపోయినప్పుడు నాకీ ఊహలేదు.

అప్పటికి నాకు పెళ్లయిపోయింది. ఆంటీయే నన్ను పెళ్లి కూతుర్ని చేసింది–

గోరింటాకు పెట్టింది!

అతను తాళి కడుతున్నప్పుడు నా జడ ఎత్తి పట్టుకుంది.

నన్ను తన ఇంటిలో వ్యక్తిగా ప్రేమించింది.

తనని చెల్లిలా చూడాలో అక్కలా చూడాలో నాకు అర్థం కాలేదు.

పెళ్లయిన ఏడాదికి నా అదృష్టం అడుగంటింది. ఆయన వెళ్ళిపోయారు.

కడుపులో పడుకున్న బిడ్డతో నేను పుట్టింటికి వచ్చేశాను.

ఆంటీ.. ఉంటే నన్ను కడుపులో పెట్టుకుని చూసేది.

నా అదృష్టం ఇలా ఉంది? – అనుకుని విచారిస్తున్నప్పుడు...

ఒంటరి పోరాటం చేస్తున్న మీరు మంచం ఎక్కారు.

మీకు జరిగిన యాక్సిడెంట్ చిన్నదే.

రెండు నెలల్లో కోలుకుంటారు. నాకు జరిగిన యాక్సిడెంట్ జీవితాంతం కోలుకోలేనిది!

మీకు అభ్యంతరం లేకపోతే జీవితాంతం మీకు తోడుగా ఉంటాను.

మీ డబ్బు ఆశించి కాదని మీకూ తెలుసు.

మీరు నాకో రక్షణగా ఉంటే.. నన్ను పెళ్లి చేసుకుంటే.. అది

తప్పనుకోవట్లేదు. మీకు అభ్యంతరం లేకపోతే నాన్నగారితో మాట్లాడతాను. ఆయన్ని వప్పిస్తాను.

మనం నలుగురం ఒకింట్లోనే ఉందాం!

నేనేదో ఒక ఉద్యోగం చేసుకుని నా కూతుర్ని మీ ఇద్దర్నీ చూసుకుంటాను!

ఈ సామాజిక రక్షణ నాకు మీరు ఇవ్వగలరని భావించవచ్చా- పిచ్చిది- పిల్లది అనుకోవద్దు.

నిజమే మీ వయస్సు మా నాన్నగారంత ఉండొచ్చేమో, ఇలాటి ప్రపోజలు మీ దగ్గరే తేగలను. నేనెప్పుడూ ఎవరి ప్రేమలోనూ పడలేదు. మీలో మంచితనం, మాట్లాడేతనం నాకు మొదట్నుంచీ ఇష్టం. ఆ విషయం నాకు తెల్సేప్పటికి మీకు సేవ చేసే అవకాశం కలిగింది. నేను మీకెంత అవసరమో తెలిసింది. మీరూ ఎవ్వరికీ జవాబు చెప్పుకోనక్కర్లేదు. నేనూ ఎవ్వరి పర్మిషనూ తీసుకోనక్కర్లేదు.

'నీవే తల్లివి, తండ్రివి

నీవే నా తోడు నీడ నీవే సఖుడౌ

నీవే గురుడవు దైవము

నీవే నా పతియు, గతియు నిజముగ కృష్ణా'

అని నాకు చిన్నప్పుడు కృష్ణ శతకంలో పద్యం నేర్పించారు. ఇప్పుడు నే కోరుతోన్న కోరికలో మీకు తప్పు కనిపిస్తే నేన్నేర్చుకున్న పాఠం తప్పయ్యుండాలి. నా కోరికను కాదనరు కదూ! మీ దాన్ని కావాలనుకునే..

మీ

అన్నపూర్ణ"

ఉత్తరం చదివిన రాజు చాలాసేపు మాట్లాడలేకపోయాడు. "అన్నపూర్ణ

ఇలాంటి నిర్ణయం తీసుకుంటుదనుకోలేదురా! నేనంటే అభిమానమే అనుకున్నా. పాపం తన బతుకలా అయ్యిందని జాలిపడ్డాను. నా ఆప్యాయతని ఆ అమ్మాయి అపార్థం చేసుకుందా? ఇందులో నా తప్పెంత, అనేది అర్థం చేసుకోలేకపోతున్నాను" అన్నాడు శంకర్.

"నువ్వు అప్పుని అపార్థం చేసుకుంటున్నావా?" అన్నాడు అన్నపూర్ణ తండ్రి రాజు.

మాట్లాడలేకపోయాడు శంకర్.

"అన్నపూర్ణ మంచి నిర్ణయం తీసుకుందిరా. నిన్నింక ఏరా అనకూడదు అల్లుడూ అనచ్చు"

"ఏం మాట్లాడుతున్నావ్? నువ్వీ విషయాన్ని సమర్థించచ్చా? నువ్వు అన్నపూర్ణని మందలించి దార్లో పెడతావని నీకీ విషయం చెప్పాను"

"చూడు శంకర్ అన్నపూర్ణ తెలివి తక్కువగా ఏ నిర్ణయం తీసుకోదు"

"నాకో కూతురుంటే అన్నపూర్ణ వయస్సులో ఉండేది"

"నాకు తెలుసు అన్నపూర్ణని దురదృష్టం వెంటాడినా మనింటికే తరుముకొచ్చింది. నీ గుండెల్లో తల్దాచుకుంటానంది తను. కాదనకయ్యా"

✦ ✦ ✦

ఆ తర్వాత మరో నలభయ్యేళ్లు అన్నపూర్ణ శంకర్ భార్యలా బతికి ఆనందాన్ని అనుభవించింది.

శంకర్, అన్నపూర్ణ పోయాక గంటలు బతకలేదు. పునిస్త్రీగా అన్నపూర్ణని సాగనంపి ఆ మర్నాడే ఆవిడ దగ్గరికి ప్రయాణమై వెళ్లిపోయాడు.

అన్నపూర్ణ కూతురికి మాత్రం తన తండ్రి శంకర్ కాదని ఇప్పటికీ తెలియదు.